# విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవు



మెట్‌పల్లి రూరల్: ప్రజా వేదికలో తనిఖీ నివేదికను పరిశీలిస్తూ సిబ్బందిని వివరణ అడుగుతున్న డీఆర్డీవో

- డీఆర్డీవో నరేశ్
- మెట్‌పల్లి మండల 14వ విడుత సామాజిక తనిఖీ ప్రజావేదిక

మెట్‌పల్లి రూరల్, డిసెంబర్ 14: ఉపాధి హామీ సిబ్బంది తమ విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని డీఆర్డీవో నరేశ్ స్పష్టం చేశారు. గురువారం మెట్‌పల్లి మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉపాధి హామీ 14వ విడుత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. మండలంలోని 23 గ్రామాల్లో 2022 ఏప్రిల్ 1 నుంచి 2023 మార్చి 31 వరకు చేపట్టిన ఉపాధి హామీ పనులకుగానూ కూలీలకు చెల్లించిన వేతనాలు రూ.3.41 కోట్లు, సామగ్రికి చెల్లించిన రూ.33లక్షలపై సామాజిక తనిఖీ బృందం సభ్యులు వివరాలు సేకరించారు. సంబంధిత నివేదికను ప్రజావేదికలో వెల్లడించగా, రూ. 26,000 రికవరీకి అధికారులు ఆదేశించారు. మస్టర్లలో సంతకాలు తీసుకోకపోవడం, సమాచార బోర్డులు సక్రమంగా లేకపోవడం, పనుల కొలతల్లో తేడాలు, అదనపు చెల్లింపులు తదితర తప్పులు చోటుచేసుకున్నట్లు నివేదికలో వెల్లడించారు. ఈమేరకు క్షేత్ర సహాయకులకు రూ. 6 వేలు, సాంకేతిక సహాయకులకు రూ. 6 వేలు, కంప్యూటర్ ఆపరేటర్లకు రూ. 1,000, పంచాయతీ కార్యదర్శులకు రూ. 10 వేల జరిమానా విధించారు. అదేవిధంగా లబ్ధిదారుల నుంచి రూ. 3 వేల రికవరీకి ఆదేశించారు. ఈ సందర్భంగా డీఆర్డీవో మాట్లాడుతూ, ఈజీఎస్ పనుల్లో పారదర్శకత కోసమే ఏటా సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. రికార్డుల నిర్వహణ సక్రమంగా చేపడుతూ, కూలీల సంఖ్యను పెంచాలని సూచించారు. సమావేశంలో ఎంపీపీ మారు సాయిరెడ్డి, డీవీవో చిన్నయ్య, ఏడీవీవో దేవేందర్, ఈజీఎస్ అంబుడ్స్‌మెన్ కృష్ణారెడ్డి, ఎంపీడీవో భీమేశ్‌రెడ్డి, ఏపీవో తిరుపతిరావు, ఎంపీవో మహేశ్వర్‌రెడ్డి, టీఏ, ఎఫ్ఏలు, కార్యదర్శులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## మంత్రిని కలిసిన బీసీ సంఘం నాయకులు



మంత్రి పొన్నం ప్రభాకర్‌ను సన్మానిస్తున్న బీసీ నాయకులు

జగిత్యాల, డిసెంబర్ 14: రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్‌ను గురువారం కరీంనగర్‌లో జిల్లా బీసీ సంక్షేమ సంఘం నాయకులు కలిసి శాలువా కప్పి పూలమాలతో సన్మానించారు. ఈ సందర్భంగా బీసీల సంక్షేమం, అభివృద్ధి కోసం కృషి చేస్తానని మంత్రి అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి ముసిపట్ల లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఆర్గనైజింగ్ కార్యదర్శి అలిశెట్టి ఈశ్వరయ్య, బీసీ సంక్షేమ సంఘం జగిత్యాల నియోజకవర్గ అధ్యక్షుడు తిరుపురం రాంచందర్, బీసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు జాజాల రమేశ్, జిల్లా బీసీ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బండారి వెంకటేశ్వర్లు, బీసీ నాయకులు పాల్గొన్నారు.

## సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

మల్యాల, డిసెంబర్ 14: రాష్ట్రంలో మహిళలు, ట్రాన్స్‌జెండర్‌లకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం అమలు చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండలకేంద్రంలోని మహిళా సమాఖ్యలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి వీవోఏలు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల సమాఖ్య అధ్యక్షురాలు అంజలి, సెర్ప్ వీవోఏలు రజిని, శ్యామల, పుష్పలత, సుమలత, అకౌంటెంట్ సరిత, వివిధ గ్రామాల వీవోలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి హామీని నెరవేరుస్తాం: ఎమ్మెల్సీ

జగిత్యాల, డిసెంబర్ 14: తాము ఎన్నికల ముందు ఇచ్చిన ప్రతి వాగ్దానాన్నీ కచ్చితంగా అమలు చేసి తీరుతామని కరీంనగర్ పట్టభద్రుల ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి స్పష్టం చేశారు. కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ ప్రభుత్వాన్ని నడిపే సామర్థ్యం ఉందని, ఉమ్మడి రాష్ట్రంలో ఆర్థికమంత్రిగా రోషయ్య ఏవిధంగా పనిచేసి, ఆర్థిక ఇబ్బందులు లేకుండా ప్రభుత్వాన్ని ఎలా ముందుకు తీసుకెళ్లారో.. ఇప్పుడు భట్టి విక్రమార్క సైతం అలానే నడుపుతారని చెప్పారు. జగిత్యాల రూరల్ మండలం పొలాసలో ఫిల్టర్‌బెడ్‌ను పరిశీలించి, ఆయన మాట్లాడారు. ఆదాయం ముఖ్యం కాదు, ప్రజల భవిష్యత్తు ముఖ్యమనే విధంగా సీఎం రేవంత్ రెడ్డి ఆలోచిస్తున్నారని కొనియాడారు. ప్రజా సంక్షేమమే ప్రధానంగా ముందుకెళ్తున్నారని, ఈ విషయాన్ని ప్రతిపక్ష నాయకులు గుర్తుంచుకోవాలన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని మద్యం నుంచి విముక్తి చేయడానికి కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామాల్లోని బెల్టు షాపులపై ఉక్కుపాదం మోపడం హర్షనీయమన్నారు. ఆయన వెంట కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## గ్రామపంచాయతీ భవనం ప్రారంభం

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 14: గొల్లపల్లిలో నూతన గ్రామపంచాయతీ భవనాన్ని ఎంపీపీ పిల్లి రేణుక, జడ్పీటీసీ చీటి లక్ష్మణ్‌రావు, సర్పంచ్ పాశం సరోజన గురువారం ప్రారంభించారు. రూ.24లక్షలతో నిర్మాణమైన గ్రామపంచాయతీ భవన ప్రారంభోత్సవానికి గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఇక్కడ ఉపసర్పంచ్ పెంజర్ల దేవయ్య, వార్డు సభ్యులు ఆలకుంట రజిత, పిట్ల శ్రీకరి, దాసరి గణేశ్, పాటి దేవయ్య, గుర్రాల సత్యారెడ్డి తదితరులు ఉన్నారు.

## మహిళ అదృశ్యం

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 14: మండల కేంద్రంలో నివాసముంటున్న షేక్ రమజా ఖానమ్(42) అనే మహిళ ఈ నెల 13 నుంచి కనిపించడంలేదని ఎస్ఐ రమాకాంత్ గురువారం తెలిపారు. ఆదిలాబాద్ జిల్లా ఖానాపూర్‌కు చెందిన అఫ్రోజ్ కొంత కాలంగా ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలో తన భార్య రమజాతో కలిసి అద్దె ఇంటిలో నివాసముంటూ వెల్డింగ్ పనులు చేసుకుంటున్నాడు. అఫ్రోజ్ బుధవారం మధ్యాహ్నం ఇంటికి వెళ్లేసరికి తన భార్య ఇంటి వద్ద లేకపోవడంతో ఇరుగు పొరుగువారు, బంధువులింట ఆరాతీసినా ఆచూకీ లభించలేదు. దీంతో ఠాణాలో ఫిర్యాదు చేయగా మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

## అక్రమ ఇసుక నిల్వల స్వాధీనం

కోరుట్ల రూరల్, డిసెంబర్ 14 : మండలంలోని నాగులపేట గ్రామ శివారులో వివిధ ప్రాంతాల నుంచి తీసుకొచ్చి అక్రమంగా నిల్వ చేసిన ఇసుక డంపులను మైనింగ్ అధికారి నిర్మల, ఆర్ఐ భూమేశ్ గురువారం స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు గ్రామశివారులో వివిధ ప్రాంతాల నుంచి అక్రమంగా నిల్వ చేసిన సుమారు 1568 ట్రాక్టర్ ట్రిప్పుల ఇసుకను స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఇసుకను రూ.15,68,000కు వేలం వేసినట్లు వివరించారు. అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను పోలీసుల బందోబస్తు మధ్య మైనింగ్, రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో ఇసుకను తరలిస్తున్నారు.

## పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన విద్యార్థులు

వీర్నపల్లి, డిసెంబర్14: మండలకేంద్రంలోని ఆదర్శ పాఠశాల విద్యార్థులు గురువారం పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. 8వ తరగతి సాంఘిక శాస్త్రం పాఠ్యాంశంలో భాగంగా పోలీస్ విధులు, చట్టాలు, కేసుల వివరాలను ఎస్ఐ నవత విద్యార్థులకు వివరించారు. రికార్డుల నమోదు తదితర విషయాలను విద్యార్థులు క్షేత్ర స్థాయిలో తెలుసుకున్నారు. ఇక్కడ ఇన్‌చార్జి హెచ్ఎం సంధ్యారాణి, ఉపాధ్యాయులు నరేశ్ ఉన్నారు.



మేడిపల్లి మండల కేంద్రంలో ర్యాలీగా వస్తున్న జీప్, టాటా మ్యాజిక్ అసోసియేషన్ సభ్యులు

## ఆటో డ్రైవర్ల ధర్నా, రాస్తారోకో

మేడిపల్లి, డిసెంబర్ 14: ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ పథకంలో భాగంగా ఉచిత బస్సు ప్రయాణానికి నిరసనగా మేడిపల్లి జీప్, మ్యాజిక్ అసోషియేషన్ సభ్యులు (డ్రైవర్‌లు) మేడిపల్లి మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై గురువారం ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయం వరకు వెళ్లి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మహాలక్ష్మీ పథకం ద్వారా ఆటో డ్రైవర్లకు నష్టం వాటిల్లడంతో ఉపాధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. డ్రైవర్లందరికీ ఉపాధి కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సభ్యులు ఎండీ షఫీ, ద్యావనపెల్లి రాజేశ్, బండ్ర అశోక్, అనిల్, బండ్ర లక్ష్మణ్, ఉట్నూరి తిరుమలేశ్, ఆకుల గణేశ్, సంఘ సభ్యులు, డ్రైవర్లు తదితరులు పాల్గొన్నారు.



మారుతీనగర్: ప్రతిభ కనబర్చిన విద్యార్థులతో మెట్‌పల్లి కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి ప్రశాంత్

## రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

మారుతీనగర్, డిసెంబర్ 13: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్‌లో భాగంగా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అనుపురం గ్రామంలో నిర్వహించిన కబడ్డీ పోటీల్లో మెట్‌పల్లి బాలుర మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల పాఠశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ చూపారు. గురువారం ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయిలో జరిగిన కబడ్డీ పోటీల్లో నలుగురు మెట్‌పల్లి గురుకుల పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపి రెండో బహుమతిని సాధించినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పల్లవి పేర్కొన్నారు. కాగా ప్రతిభ చూపిన విద్యార్థులకు మెట్‌పల్లి కబడ్డీ అసోసియేషన్ కార్యదర్శి మాడవేని ప్రశాంత్ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

కోరుట్ల, డిసెంబర్ 14: పట్టణంలోని టీఎస్ డబ్ల్యూఆర్ఎస్ జూనియర్ కళాశాల విద్యార్థులు రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలోని అణుపురం గ్రామంలో జరిగిన జిల్లా స్థాయి కబడ్డీ పోటీల్లో కళాశాలకు చెందిన వినయ్, హర్షవర్ధన్, మణి ప్రతిభ చూపి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ బాబు గురువారం తెలిపారు. ప్రతిభ చూపిన విద్యార్థులను వైస్ ప్రిన్సిపాల్ ప్రేమలత, పీఈటీలు అజయ్, ప్రణయ్ అభినందించారు.



కోరుట్ల: విద్యార్థులను అభినందిస్తున్న అధ్యాపకులు

## పాఠశాలకు వాటర్‌ఫిల్టర్ బహూకరణ



వాటర్‌ఫిల్టర్‌ను బహూకరిస్తున్న దుంపల మహిపాల్‌రెడ్డి

మేడిపల్లి, డిసెంబర్ 14 : భీమారం మండలం మన్నెగూడెం గ్రామం ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థుల సౌకర్యార్థం రూ.20 వేల విలువైన వాటర్ ఫిల్టర్‌ను గురువారం దాత దుంపల మహిపాల్‌రెడ్డి, సర్పంచుల ఫోరం జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి నరేశ్‌రెడ్డి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శిరీష, ఉపాధ్యాయుడు శ్రీనివాస్, మాజీ సర్పంచ్ గౌరి భూమయ్య, అలయన్స్ క్లబ్ సభ్యులు రాజేంద్ర ప్రసాద్, కటుకం సురేందర్, దుంపాల మనోజ్‌రెడ్డి, అంకూష్ పాల్గొన్నారు.

## కేసీఆర్ త్వరగా కోలుకోవాలని పూజలు



గోరంటాల సాయిబాబా ఆలయంలో పూజలు చేస్తున్న బీఆర్ఎస్ నేతలు

గంభీరావుపేట, డిసెంబర్ 14: మండలంలోని గోరంటాల సాయిబాబా ఆలయంలో గురువారం బీఆర్ఎస్ నేతలు తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ త్వరగా కోలుకోవాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. హైదరాబాద్ యశోద దవాఖానలో చికిత్స పొందుతున్న కేసీఆర్ సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజల మధ్యకు రావాలని ఆకాంక్షిస్తూ సాయిబాబాకు అభిషేక పూజలు చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు కొమిరిశెట్టి లక్ష్మణ్, సురేందర్, యాదగిరి, సతీశ్, సత్యం, సుధాకర్ తదితరులు ఉన్నారు.

## మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజలు

గంభీరావుపేట, డిసెంబర్ 14: మండల కేంద్రంలోని మహంకాళి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ చేసి వారం రోజులు ముగిసిన సందర్భంగా మారు నైవేద్యం సమర్పించి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపు చేశారు. అనంతరం ఆలయ ఆవరణలో నిర్వహించిన సామూహిక కుంకుమ పూజా కార్యక్రమంలో మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. భక్తులకు అర్చకులు తీర్థప్రసాదాలు అందించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మల్లుగారి నర్సాగౌడ్ ఉన్నారు.